ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
మంగళవారం 5 మార్చి 2024



ఉమ్మడి జిల్లాలో 91 విద్యుత్ ఫీడర్ల ఏర్పాటు

సాలూరు రూరల్, మార్చి 4: ఉమ్మడి జిల్లాలో నిరంతర విద్యుత్‌కు 91 విద్యుత్ ఫీడర్లు ఏర్పాటు చేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణ రావు తెలిపారు. సోమవారం సాలూరు విచ్చేసిన ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 25 ఫీడర్ల పనులు ప్రారంభించామన్నారు. ఆయా పనులన్నీ పూర్తయితే గ్రామీణ ప్రాంతాలకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. బాగువలస ఫీడర్‌లో 24 గంటల విద్యుత్ సరఫరాకు కార్యాచరణ సిద్ధం చేశామని వెల్లడించారు. ఆయన వెంట ఏపీఈపీడీసీఎల్ డీఈ రంగారావు, ఏఈ సింహాచలం తదితరులున్నారు.

వారికి ఇవ్వరు.. వీరిని తీసుకోనివ్వరు!





- జిల్లాలో 5,489 సంఘాల ఖాతాల్లో ఇంకా పడని రూ. 33.38 కోట్లు
- 11,280 సంఘాలకు జమ అయినా చెల్లింపుల్లేవ్
- కొందరికేనా 'ఆసరా' అని ప్రశ్నిస్తున్న మహిళా సంఘాలు
- ఎన్నికల కోడ్‌లోపు న్యాయం చేయాలని డిమాండ్

(జియ్యమ్మవలస)

సంక్షేమ పథకాల అమలులో ఆదర్శంగా నిలుస్తున్నామని చెబుతున్న వైసీపీ ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమవుతోంది. ఆచరణలో మాత్రం భిన్నంగా వ్యవహరిస్తోంది. ఎంతో ఆర్భాటంగా సీఎం జగన్ బటన్ నొక్కుతున్నా.. లబ్ధిదారుల ఖాతాల్లో మాత్రం వెంటనే ఆ సొమ్ము జమకావడం లేదు. రోజులు గడుస్తున్నా.. అతీగతీ ఉండడం లేదు. దీనిపై అధికారులు కూడా ఏమీ చెప్పలేని పరిస్థితి. ఆసరా పథకం విషయానికొస్తే.. నాలుగో విడత సొమ్ము ఇంకా జిల్లాలోని మహిళా సంఘాల అకౌంట్లలో జమ కాలేదు. దీంతో వారు నిరాశ చెందుతున్నారు. కొన్ని చోట్ల మహిళా సంఘాల ఖాతాల్లో నగదు జమ అయినా.. నేటికీ చెల్లింపులు చేయలేదు. జిల్లావ్యాప్తంగా చూసుకుంటే ఇంకా 5,489 సంఘాల ఖాతాల్లో డబ్బులు పడలేదు. దీంతో ఆయా సంఘాల సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ లోపల ఆసరా సొమ్ము పడుతుందో.. లేదోనని టెన్షన్ పడుతున్నారు. కొందరికే ఈ పథకం వర్తింపజేసేలా ఉందంటూ మహిళా సంఘాలు భగ్గుమంటున్నాయి. దీనిపై సర్కారు స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో పాలకొండ, పార్వతీపురం డివిజన్ల పరిధిలోని 15 మండలాలు, మూడు మున్సిపాలిటీల్లో 19,800 వరకు మహిళా సంఘాలు ఉన్నాయి. కాగా గత మూడేళ్లలో సకాలంలో ఆసరా పథకం కింద నగదు అందించిన ప్రభుత్వం ఈ ఏడాది నాలుగో విడత మాత్రం జాప్యం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని సంఘాల ఖాతాల్లోనే నగదు జమ కావడంతో మిగిలిన సంఘ సభ్యులు మండిపడుతున్నారు. కొందరికే పథకం పరిమితం చేసినట్లుగా ఉందనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. గత మూడు విడతల్లో అర్హులైన తాము నాలుగో విడతకు వచ్చేసరికి అనర్హులమయ్యామా?.. లేక మరే కారణం ఉందో తెలియజేయాలని పలు సంఘాల సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

నాలుగో విడత ఇలా..

వైఎస్ఆర్ ఆసరా పథకం నాలుగో విడత మాత్రం ఎన్నికల ప్రచారంలా మారిందని చెప్పొచ్చు. వాస్తవంగా జనవరి 23న బటన్ సీఎం జగన్ బటన్ నొక్కారు. అదే నెల 24 నుంచి 31వ తేదీ వరకు స్థానిక ఎమ్మెల్యేల అనుమతితో మండలాల వారీగా సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వివరిస్తూ మరోసారి అవకాశం ఇవ్వాలంటూ ఊదరగొట్టారు. అయితే సమావేశాలు పూర్తయినా... ఫిబ్రవరి 15వ తేదీ వరకు ఆసరా నగదు జమ కాకపోవడంతో మహిళా సంఘాలు కొంత ఆందోళన చెందారు. అయితే ఆ తరువాత ప్రభుత్వం జమ చేసిన విధానం కూడా వారికి ఆగ్రహం తెప్పిస్తోంది.

డబ్బులు తీసేందుకు మోకాలడ్డు..

వాస్తవానికి 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను 16,669 మహిళా సంఘాల ఖాతాల్లో రూ. 94.33 కోట్లు జమ కావల్సి ఉంది. కానీ 11,280 మహిళా సంఘాలకు సంబంధించి 1,25,236 మంది మహిళలకు రూ. 60.95 కోట్లు జమ అయినట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ఇంకా 5,489 మహిళా సంఘాలకు సుమారు రూ. 33.38 కోట్లు జమ కావల్సి ఉంది. మరి ఇది ఎప్పుడు జమ చేస్తారో ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులకే తెలియాలి. ఇదిలాఉండగా ఇంతవరకు జమైన సొమ్మును మహిళా సంఘాలు డ్రా చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఈ డబ్బులు డ్రా చేసుకోవడానికి వెలుగుకు సంబంధించిన కొందరు సీసీలు, గ్రామ వీవోఏలు మోకాలడ్డుతున్నారు. అందరికీ పూర్తిస్థాయిలో నగదు జమ అయిన తరువాతే తీసుకొనేందుకు అవకాశం ఇవ్వాలని బ్యాంకు మేనేజర్లకు కోరుతున్నారు. అయితే ఖాతాల్లో నగదు పడని వారికి ఎప్పుడు జమ అవుతుందో మాత్రం చెప్పడం లేదు. దీంతో మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. ఎన్నికల కోడ్‌కు సమయం సమీపిస్తుండడంతో ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి త్వరగా 'ఆసరా' అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

జమ అయినా..

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మా గ్రూపునకు ఆసరా పథకం కింద రూ. 1,44,626 జమ అయ్యింది. కానీ అందరికీ పూర్తిస్థాయిలో నగదు జమ అయిన తరువాత డబ్బులు డ్రా చేయాలని వెలుగు సిబ్బంది చెబుతున్నారు.

– గంగమ్మ, ప్రెసిడెంట్, నవ చైతన్య మహిళా సంఘం, చినమేరంగి

పరిశీలిస్తున్నాం..

ఆసరా పథకం కింద కొద్దిరోజుల్లోనే మహిళా సంఘాల ఖాతాల్లో నగదు జమ కానున్నది. దీనిపై కారణాలు ఏమిటో పరిశీలిస్తున్నాం. ఈ నెల ఏడో తేదీకి నగదు పడే అవకాశం ఉంది.

-డి.వెంకట్, ఏపీఎం (ఆసరా), పార్వతీపురం మన్యం జిల్లా



గుమ్మలక్ష్మీపురంలో..

ఏజెన్సీలో కవాతు

- ఎన్నికల నేపథ్యంలో చేరుకున్న పోలీసు బలగాలు

గుమ్మలక్ష్మీపురం/మక్కువ: జిల్లాలో మరికొద్ది రోజుల్లో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు గాను ఏజెన్సీ ప్రాంతాలకు సీఆర్‌పీఎఫ్ బలగాలు చేరుకున్నాయి. దీంతో ఎల్ఎన్‌పేట సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో వారు భద్రగిరి నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు సోమవారం కవాతు నిర్వహిచారు. డీఎస్పీ కృష్ణారావు, సీఆర్‌పీఎఫ్ అధికారులు, ఎల్ఎన్ పేట ఎస్ఐ పాల్గొన్నారు. మక్కువలోనూ ఏఎస్పీ సునీల్ సోరెన్ ఆధ్వర్యంలో రైల్వే భద్రతా విభాగం పోలీసులు 80 మంది ప్రధాన రహదారుల వెంట కవాతు నిర్వహించారు. ఈ ర్యాలీని గ్రామస్థులు ఆసక్తిగా తిలకించారు. సాలూరు సీఐ బాలకృష్ణ, ఎస్ఐ నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



మక్కువలో..

పదేళ్లలోపు పిల్లల

మరణాలు నివారించండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదేళ్లలోపు పిల్లల మరణాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యాధికారులు, మహిళా శిశు సంక్షేమశాఖ సిబ్బందితో సమీక్షించారు. విద్యార్థుల మరణాల రేటు తదితర అంశాలపై చర్చించారు. రక్తహీనత, టీకాలు, పౌష్టికాహారం పంపిణీపై గ్రామ, మండల స్థాయి అధికారులు, సిబ్బందికి సంపూర్ణ అవగాహన ఉండాలని కలెక్టర్ తెలిపారు. తల్లి గర్భం నుంచే పర్యవేక్షణ ఉండాలన్నారు. గర్భిణులు, బాలింతలు, రక్తహీనతతో బాధపడుతున్న వారు, బరువు తక్కువ, వయసుకు తగిన ఎత్తు లేనివారిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. వారంతా పౌష్టికాహారం తినే విధంగా పర్యవేక్షణ చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశ, మహిళా పోలీస్ ఇంటింటా పర్యటించి రక్తహీనత కలిగిన వారిని గుర్తించాలని సూచించారు. అవసరం మేరకు ప్రభుత్వాసుపత్రులను వినియోగించుకోవాలని సూచించారు. పిల్లలకు శతశాతం టీకాలు వేయించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌వో జగన్నాథరావు, ప్రోగ్రాం అధికారి వినోద్ తదితరులున్నారు.

నిరసన బాటలో..

- పీఏసీఎస్ ఉద్యోగుల సహాయ నిరాకరణ

గరుగుబిల్లి, మార్చి 4 : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు సోమవారం పీఏసీఎస్ కార్యాలయాల్లో విధులు నిర్వహించకుండా సహాయ నిరాకరణకు దిగారు. గరుగుబిల్లి పీఏసీఎస్‌లో విధులు నిర్వహించాలని పార్వతీపురం డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ యేగిరెడ్డి శ్రీనివాసరావు సిబ్బందిపై ఒత్తిడి తెచ్చారు. దీనికి వారు ససేమిరా అంటూ.. విధులు నిర్వహించేది లేదని వినతిపత్రం అందించారు. అనంతరం జిల్లా పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు రెడ్డి సత్యారావు మాట్లాడుతూ.. పనులు నిర్వహించాలని డీసీసీబీ అధికారులు ఒత్తిడి తేకూడదన్నారు. రాష్ట్ర యూనియన్ ఆదేశాల మేరకు ఈ నెల 10 వరకు దశల వారీగా ఆందోళన చేపడతామన్నారు. డిమాండ్ల పరిష్కార మయ్యేంతవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలోని 94 సహకార సంఘాల్లో సుమారు 300 మంది ఉద్యోగులు గత నాలుగు నెలలుగా తమ సమస్యలపై ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించినా, ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా స్పందించ లేదన్నారు. పలు సంఘాల్లో ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. డీసీసీబీల మాదిరిగానే పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేయాలని, డీఏను అమలు చేయాలని, 2019 మార్చి తర్వాత చేరిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పీఏసీఎస్ ద్వారానే రైతులకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 11 నుంచి సమ్మెలోకి వెళ్తామని ఆయన స్పష్టం చేశారు.



డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న జిల్లా యూనియన్ ప్రతినిధులు

వీవోఏల కలెక్టరేట్ ముట్టడి

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వీవోఏలు

బెలగాం, మార్చి 4: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, సీఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైకేపీ వీవోఏలు నినదించారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం వారు కలెక్టరేట్‌ను ముట్టడించారు. అక్కడే బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలని , హెచ్‌ఆర్ పాలసీ ఇవ్వాలని, మూడేళ్ల కాలపరిమితి సర్కులర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ సదుపాయం, భద్రత కల్పించాలని, యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని , వీవోఏల విలీనం ఆపాలని కోరారు. తమ సమస్యల పరిష్కారంపై జీవో విడుదల చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. నిరసన అనంతరం పీడీకి వినతిపత్రం ఇచ్చారు. ఈ నిరసనలో వీవోఏ సంఘం నాయకులు కుమారి, సీఐటీయూ నాయకులు జి.వెంకటరమణ, కె.ధర్మరాజు, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు తీపి కబురు

- హైకోర్టు తీర్పుతో ప్రిపరేషన్‌కు గడువు పెరిగే అవకాశం

సాలూరు రూరల్,మార్చి 4: ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ (టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్)కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు మరింత గడువు చిక్కనుంది. టెట్, డీఎస్సీ (టీఆర్‌టీ) మధ్య కేవలం ఒక్కరోజు గడువు ఉండడంతో కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో టెట్ ఫలితాలు వెలువడిన తర్వాత నాలుగు వారాల గడువుతో డీఎస్సీ నిర్వహించాలని, కీ విడుదల, అభ్యంతరాల స్వీకరణకు గడువు ఉండాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో డీఎస్సీ రీ షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేయనున్నది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే అది రావొచ్చని పలువురు భావిస్తున్నారు. వాస్తవంగా గతనెల 8, 12న, టెట్, డీఎస్సీకి నోటిఫికేషన్లు ఇచ్చారు. గత నెల 18 వరకు టెట్‌కు దరఖాస్తులు స్వీకరించగా.. ఫిబ్రవరి 27 నుంచి టెట్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 9 వరకు ఆ పరీక్షలు జరగనున్నాయి. టెట్ ఫలితాలు ఈ నెల 14న వెలువడనున్నాయి. డీఎస్సీకి గత నెల 25 వరకు దరఖాస్తులు స్వీకరించారు. అయితే టెట్ ఫలితాలు వెలువడిన వెంటనే ఈ నెల 15 నుంచి డీఎస్సీ పరీక్షలను నిర్వహించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీలు 103, పాఠశాల సహాయకులు 97, టీజీటీ 84 మొత్తంగా 284 ఖాళీలను చూపించారు. వీటికి వేలాదిగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ప్రిపరేషన్(సన్నద్ధం)కు సమయం చాలకపోవడం తీవ్ర ఒత్తిడి లోనయ్యారు.

ఎస్టీలుగా గుర్తించండి

- పోర్జా కులస్థుల డిమాండ్
- సీతంపేట ఐటీడీఏ ఎదుట ధర్నా

సీతంపేట: తమను ఎస్టీలుగా గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని పోర్జా (ఫైడి) కులస్థులు డిమాండ్ చేశారు. సోమవారం సీతంపేట వారపు సంత నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా చేశారు. అనంతరం ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గేదెల చిరంజీవి, గొర్లె జీవన్‌కుమార్ మాట్లాడుతూ... 1950లో కేంద్ర ప్రభుత్వం గెజిట్ ప్రాప్తికి పోర్జా ఫైడి కులస్థులను పీవీటీజీలుగా గుర్తించినట్లు చెప్పారు. అయితే వైసీపీ ప్రభుత్వం దానిని అమలు చేయడం లేదన్నారు. దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు తమకు అందడం లేదని, తీవ్ర అన్యాయానికి గురవు తున్నామని స్పష్టం చేశారు. తమకు న్యాయం చేయాలని అనంతరం ఐటీడీఏ పీవో కల్పనాకుమారికి వినతిపత్రం అందించారు. కాగా ధర్నా సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ నిరసనలో సంఘ నాయకులు రాజారావు, నాగరాజు, దుర్యోదన తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న పోర్జా కులస్థులు



సమస్యలపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని నిలదీస్తున్న ప్రజలు

మా సమస్యలను పట్టించుకోరా?

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని నిలదీసిన వీవర్స్ కాలనీవాసులు

పాలకొండ: పట్టణంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిలకు చేదు అనుభవం ఎదురైంది. పలు సమస్యలపై ప్రజలు వారిని నిలదీశారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు వీవర్స్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతవాసులు తమ సమస్యలు పట్టించుకోరా? అంటూ వారిని ప్రశ్నించారు. 'ఐదేళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ మేము గుర్తుకొచ్చామా?' అని మండిపడ్డారు. తమ ప్రాంతంలో కాలువలు మరమ్మతులు చేయడం లేదని, రోడ్లు లేవని, కనీసం మురుగు కాలువలు శుభ్రం చేసే పరిస్థితి లేదని కాలనీ వాసులు తెలిపారు. వీధి లైట్లు వెలగడం లేదని, ఎన్నిసార్లు అధికారులకు వినతులు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా చొరవ చూపి తగు చర్యలు తీసుకోవాలని వారు నినదించారు.

మా ఓట్లతో గెలిచి మా నోట్లోనే మట్టి

- ఉప ముఖ్యమంత్రిపై గిరిజనుల ధ్వజం
- మెంటాడలో రిలే దీక్షలు

మెంటాడ, మార్చి 4: 'గిరిజన బిడ్డవని నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించాం. ఉపముఖ్యమంత్రి హోదా వరకూ ఎదిగేందుకు దోహదపడ్డాం. మా తలరాతలు మారుస్తారని ఆశించాం. కానీ మీ నుంచి అడుగడుగునా వంచనకు గురయ్యాం. సాటి గిరిజనులను అణగదొక్కుతున్నారు. చేసిన తప్పునకు మూల్యం చెల్లించుకోక తప్పదు' అంటూ ఆదివాసీ, ప్రజాసంఘాలు, సీపీఎం నేతలు ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తీరుపై మండిపడ్డారు. మెంటాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీ గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గిరిజనులు సోమవారం రిలే దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గ పరిధిలోని గిరిజనుల బతుకులు మరింత ఛిద్రమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలు లేక గిరిజన తండాలు దయనీయ స్థితిలో ఉన్నాయన్నారు. పోడు పట్టాల కోసం ఆదివాసీలు పోరు బాట పడితే పెత్తందార్లకు లబ్ధి చేకూర్చుతున్నారని ధ్వజమెత్తారు. గిరిజన హక్కులను పాలకులే కాలరాస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం గిరిజనుల సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ దీక్షల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు రాములు, గిరిజన సంఘం నేతలు సోములు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు ప్రారంభించిన గిరిజనులు

మోసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు

● ఎస్పీ దీపిక ● 'స్పందన'కు 31 వినతులు



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

విజయనగరం దాసన్నపేట: జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో నమ్మించి మోసాలకు పాల్పడే వారిపై విచారణ చేపట్టి చట్ట పరిధిలో కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ దీపిక పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమంలో 31 ఫిర్యాదులను స్వీకరించారు.

● విజయనగరానికి చెందిన మహిళ ఎస్పీ దీపికకు ఫిర్యాదు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి తన కుమార్తెకు ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని నమ్మబలికి రూ.5 లక్షల 10 వేల నగదు తీసుకున్నారని, నేటి వరకూ సీటు ఇప్పించలేదని... తీసుకున్న డబ్బు కూడా తిరిగి ఇవ్వలేదని తెలిపారు.

● బ్యాంకు వేలంలో విడిపించిన బంగారాన్ని తనతో పాటు వచ్చిన వ్యక్తి ఉంచుకుని రెండేళ్లుగా ఇవ్వకుండా తన వద్ద ఉంచుకున్నారని విజయనగరానికి చెందిన ఓ వ్యక్తి తెలిపారు. న్యాయం చేయాలని కోరారు.

● తన భర్తతో కుటుంబ తగాదాల కారణంగా తనపై కేసు పెట్టారని.. రెండేళ్ల కుమార్తెను భర్త తీసుకుని వెళ్లిపోయారని.. బిడ్డను అప్పగించేలా చూడాలని బొబ్బిలి పట్టణానికి చెందిన మహిళ కోరారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి తీసుకున్న చర్యలను నివేదించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అస్మాపరహీన్, డీఎస్పీ విశ్వనాథ్, సీఐలు మురళి, విజయనాథ్, ఎస్ఐ ప్రభావతి పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే

విజయనగరం రూరల్: పల్స్ పోలియోకి సంబంధించి సోమవారం రాకోడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. వివిధ కారణాలతో పోలియో కేంద్రాలకు రాకుండా ఉన్న వారిని గుర్తించి చుక్కల మందు వేశారు. జొన్నవలసలో వైద్యాధికారి ఎన్.శ్రావణి, డాక్టరు బంగారు అఖిల పరిశీలించారు.

రేపు సింగిడి పోటీలు

రేగిడి: సంకిలి గ్రామంలో వారాడ పట్టాభినాయుడు స్మారకార్థం ఈ నెల 6న సింగిడి పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు 63028 92672, 63002 78441 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు పశువుల సంత ప్రారంభం

బొబ్బిలి: బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో ఈ నెల 6న పశువుల వారపు సంతను ప్రారంభించనున్నట్లు ఏఎంసీ ఛైర్మన్ బొమ్మి శ్రీనివాస్ తెలిపారు. ప్రైవేట్ స్థలంలో నిర్వహించే వారపు సంతను కరోనా సమయంలో పూర్తిగా ఎత్తివేశారు. రైతులు, వినియోగదారుల డిమాండ్ మేరకు ఏఎంసీ స్థలంలో ప్రతి బుధవారం పశువుల సంతను నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

రేపు శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఏసీ సౌకర్యం

బొబ్బిలి: స్థానిక శ్రీ కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 6న ఏసీ సౌకర్యం ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి నంబియార్ వేణుగోపాలరావు తెలిపారు. సోమవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. పోలీసుల సూచనల మేరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శ్రీకళాభారతి ఉపాధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి పుల్లెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

1,741 మందికి హక్కుపత్రాల పంపిణీ

బొబ్బిలి: అర్హత కలిగిన ప్రతి పేదవానికీ సొంతింటి నిర్మాణ కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక శ్రీ కళాభారతి ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 1,741 మందికి జగనన్న శాశ్వత ఇళ్ల స్థలాల హక్కుపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, కమిషనర్ లాలం రామలక్ష్మి, వైస్‌చైర్మన్లు గొలగాని రమాదేవి, చెలికాని మురళీకృష్ణ, రేజేటి విస్సు తదితరులు పాల్గొన్నారు.

ఖాసాపేటలో పశువైద్య శిబిరం

లక్కవరపుకోట: ఖాసాపేట గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి కె.గాయత్రి పశువులను పరీక్షించి.. రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. పశువ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పించారు.

రేపు ఆశీలు వేలం పాట

రాజాం: స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో ఈ నెల 6న ఉదయం 11 గంటలకు ఆశీల వేలం పాట నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎల్.నారప్పల నాయుడు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కాంట్రాక్టర్లు పాటలో పాల్గొనాలని కోరారు.

జీఎంఆర్ ఐటీలో నేడు అంతర్జాతీయ సదస్సు

రాజాం: స్థానిక జీఎంఆర్ఐటీ వేదికగా ఈ నెల 5, 6 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఏఐ-పవర్డ్ టెక్నాలజీ... ఇంటిగ్రేషన్ ఫర్ సస్టైనబిలిటీ అనే పేరుతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ వాణిజ్య విభాగ కార్యదర్శిగా అడ్డా

బాడంగి: టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శిగా తనను నియమించినట్లు అడ్డా గోవిందరాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ అవకాశం ఇచ్చిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు డూండి రాకేష్, బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బేబీనాయన, మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

రామభద్రపురం: మండలంలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో తిరుమలప్రసాద్ తెలిపారు. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు రోజూ ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని చెప్పారు.

జనసైనికుడి కుటుంబానికి అండగా ఉంటా

జామి: జన సైనికుడి కుటుంబానికి అండగా ఉంటామని గజపతినగరం జనసేన పార్టీ సమన్వయకర్త మర్రాపు సురేష్ అన్నారు. సోమవారం లొట్లపల్లి గ్రామానికి చెందిన జన్నేల శేఖర్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆ యువకుడిని పరామర్శించి.. రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మిడతాన రవికుమార్, పోతల రాంబాబు, బాలకృష్ణ, గోవింద్, పీవీఆర్ వర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

చెరకు పంట దగ్ధం

బాడంగి: ముగడ గ్రామంలో సుమారు 50 ఎకరాలలో సోమవారం చెరకు, మామిడి, నీలగిరి తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. రైతులు చిట్టు చిన్నంనాయుడు, తీళ్ల శంకరరావు, తెంటు శంకరరావు, రెడ్డి పాపినాయుడు నష్టపోయారు. సకాలంలో అగ్నిమాపక శకటం రావడంతో పెను ప్రమాదం తప్పింది.

కరాటే క్రీడాకారుడికి ఆర్థిక సాయం

శృంగవరపుకోట: రాజీపేటకు చెందిన జుత్తాడ జగదీష్ అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఆదిబాబు సోమవారం అతనికి రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. టీడీపీ బూత్ ఇన్‌చార్జి పెంటకోట వెంకటరావు, తూర్పాటి నాయుడు, గోపిశెట్టి నాయుడు పాల్గొన్నారు.

'స్వామి వివేకానంద' పుస్తకాల పంపిణీ

శృంగవరపుకోట: స్థానిక మోక్ష విద్య యోగామందిర్ ఆధ్వర్యంలో సోమవారం ఓ ప్రైవేటు పాఠశాలలో 'స్వామి వివేకానంద జీవిత సందేశం' అనే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు 100 పుస్తకాలను అందించారు. ఆర్టీసీ డీఎం కె.రమేష్, యోగా మందిర్ వ్యవస్థాపకుడు శీలా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను మేనిఫెస్టోల్లో చేర్చండి

బొబ్బిలి: ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారుల సమస్యలను రాజకీయ పార్టీల నేతలు తమ మేనిఫెస్టోల్లో చేర్చాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ హోమ్‌లో సోమవారం సీహెచ్‌జే ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసిన జీఓ 117ను రద్దు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, అప్రంటీస్ లేని డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. జోగినాయుడు, చంద్రినాయుడు, సింహాచలం, లక్ష్మణరావు, రామకృష్ణ, చెల్లూరు ప్రసాద్, ఎల్లయ్య పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

రాజాం: కైలష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సహకారంతో బొబ్బిలిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 15 మండలాలకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో సదస్సు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, వాటిని నిరోధించడంలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు.

టీడీపీ హయాంలోనే మహిళలకు అధిక ప్రాధాన్యం



వృద్ధురాలితో మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

● విజయనగరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: టీడీపీ హయాంలోనే మహిళలకు అధిక ప్రాధాన్యం ఉండేదని... ప్రస్తుత ప్రభుత్వ హయాంలో వారికి ఇబ్బందులు తప్పడం లేదని టీడీపీ విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకి గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం అయ్యన్నపేట, రాజవీధి, చిన్నవీధి, మండల వీధి, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ హామీలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలకు ఆస్తిలో వాటా, స్థానిక సంస్థల్లో కోటా, డ్వాక్రా సంఘాల వంటి వాటితో ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యం చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, వరకట్న వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓటేసి గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పడాల అనూష, పడాల జోగేష్, తాళ్లపూడి సురేష్, మజ్జి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి..

విజయనగరం (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి పూసపాటి అదితి గజపతిరాజు అన్నారు. సోమవారం రాత్రి విజయనగరం మండలం రీమాపేట గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో మంచినీరు, వీధి దీపాలు, పారిశుధ్య సమస్యలను మహిళలు అదితి గజపతికి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయితీలకు ఇస్తున్న నిధులు కూడా సీఎం జగన్ దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. మరో 45 రోజుల్లో తెలుగుదేశం ప్రభుత్వం వస్తుందని.. సమస్యలు లేని రీమాపేటగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు ఈగల సత్తిబాబు, చిల్లా సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు బొద్దల నర్సింగరావు, రేగాన ప్రకాశరావు, తాడ్డి నారాయణప్పడు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ కౌన్సిల్ సమావేశంలో గరం గరం

● అధికార పార్టీ కౌన్సిలర్ల మధ్య దూషణల పర్వం
● మున్సిపల్ డీఈఈపై వేటుకు సన్నాహాలు

బొబ్బిలి: ప్రీ కౌన్సిల్ సమావేశం గరంగరంగా సాగింది. అధికార పార్టీ కౌన్సిలర్ల మధ్య తీవ్ర స్థాయిలో తిట్లు, దూషణల పర్వం సాగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ నెలాఖరున జరగాల్సిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఈ నెల 7న నిర్వహించాలని నిర్ణయించారు. కౌన్సిల్ సమావేశానికి ముందు అనుసరించాల్సిన వ్యూహంపై అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లందరినీ ఛైర్మన్ సమావేశపరచడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా సోమవారం ఛైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు తీవ్ర స్వరంతో ఒకరిపై ఒకరు కలియబడ్డారు. జనరల్ ఫండ్ కేటాయింపులకు సంబంధించి ఈ వివాదం రగిలింది. మున్సిపల్ వైస్ ఛైర్మన్-అధికార పార్టీ మహిళా కౌన్సిలర్ భర్త మధ్య పెను వివాదం రేగింది. వారిని శాంతింపజేయలేక కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు మెల్లగా అక్కడి నుంచి బయటకు వచ్చేశారు.

డీఈఈపై వేటుకు ..

రెండు నెలల క్రితం బొబ్బిలి మున్సిపల్ డీఈఈగా చేరిన కనకరాజు వైఖరి నచ్చని కొంతమంది కాంట్రాక్టర్లు, కౌన్సిలర్లు అతనిపై బదిలీ వేటు వేయించాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రీ కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కౌన్సిలర్లు చర్చకు పెట్టారు. ఇందులో కొంతమంది అనుకూలంగా... మరికొంతమంది ప్రతికూలంగా మాట్లాడారు. రానున్న ఎన్నికలలో బొబ్బిలికి ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా డీఈఈ నియమితులయ్యారు. ఆయనను ఇక్కడి నుంచి బదిలీ లేదా సరెండర్ చేసే విధంగా తీర్మానం చేయాలని కౌన్సిలర్లు చర్చించారు. దీనిని కొంతమంది వ్యతిరేకించారు. ఎమ్మెల్యే గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఈ నెల 7న కౌన్సిల్ సమావేశంలో టేబుల్ అజెండాలో డీఈఈ సరెండర్ అంశాన్ని చేర్చాలని యోచిస్తున్నారు. ఎన్నికల కోడ్ రాక మునుపే ఇవన్నీ చక్కబెట్టాలన్నది అధికార పార్టీ వ్యూహం. దీనిపై అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా మాట్లాడేందుకు ఇష్టపడలేదు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ

జేఎన్‌టీయూలో టెక్నికల్ సింపోజియం

విజయనగరం రూరల్: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో జాతీయ స్థాయి 12వ టెక్నికల్ సింపోజియంను సోమవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా పరిశ్రమ రంగాల్లో వస్తున్న నూతన టెక్నాలజీని వివరించే లక్ష్యంతో ఈ సింపోజియం ఏర్పాటైందన్నారు. ఈ కార్యక్రమంలో నేవల్ డాక్ యార్డు క్వాలిటీ ఎస్యూరెన్స్ విభాగం ప్రతినిధి రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీకుమార్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి నీలిమాదేవి, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్స్ మణికుమార్, శ్రీనివాస ప్రసాద్, స్టూడెంట్ కో-ఆర్డినేటర్లు కె.బాలాదిత్య, పి.జ్ఞానశరణ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత అవసరం

రేగిడి: పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనం విషయంలో రుచి, శుచితో పాటు, నిర్దేశించిన మెనూ పాటించాలని ఎంఈఓ వరప్రసాదరావు ఉపాధ్యాయులకు, వంట నిర్వాహకులకు ఆదేశించారు. కందిశ హైస్కూల్‌లో సోమవారం మధ్యాహ్న భోజనం నిర్వహణను ఎంఈఓ వరప్రసాదరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణరావు, ఎంఐసీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

వైభవంగా దుర్గమాంబ తీర్థ మహోత్సవం

లక్కవరపుకోట: సంతపేటలో వెలసిన దుర్గమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం సోమవారం వైభవంగా సాగింది. మహిళలు భారీ సంఖ్యలో హాజరై అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి.. మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఎడ్లబండ్ల పోటీలు ఆకట్టుకున్నాయి. చోడవరం బండి మొదటి స్థానంలో నిలిచింది. గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు.



ఎడ్లబండ్ల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

లైన్‌మన్ల సేవలు వెలకట్టలేనివి

బొబ్బిలి: జాతీయ విద్యుత్ లైన్‌మన్ల దినోత్సవాన్ని స్థానిక శ్రీవేణు గోపాలస్వామి ఆలయం వద్ద గల ఫ్యూజ్‌కాల్ ఆఫీసులో సోమవారం నిర్వహించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ జి.దేముడు, లైన్‌మేన్లు అలమండ రమణ, పెంట హరికృష్ణ, పుట్టా చింతయ్య, భోగి సురేష్ కుమార్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రతికూల వాతావరణ పరిస్థితులలోనూ విద్యుత్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివని అన్నారు.



లైన్‌మన్లను సన్మానిస్తున్న దృశ్యం

ఉచిత విద్య.. వైద్యమే లక్ష్యం

విజయనగరం దాసన్నపేట: రాష్ట్రంలోని ప్రజలందరికీ ఉచిత వైద్యం, విద్య అందించడమే ఆంధ్ర రాష్ట్ర సమితి లక్ష్యమని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జంధ్యనం కోటేశ్వరరావు అన్నారు. ప్రజా ఎదుగుదల యాత్ర శ్రీకాకుళం నుంచి విజయనగరం చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వస్తే రేషన్ కార్డు ఉన్న పేదలకు భూమి ఇస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు విడతల వారీగా ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడతామన్నారు. పార్టీ నాయకులు పఠాన్ భాష, తోకల శ్రీనివాస్, గోపి, మల్లేశ్వరీ పాల్గొన్నారు.

శ్రీనివాసరావు కుటుంబానికి న్యాయం చేయాలి

రాజాం: చీపురుపల్లి రోడ్డులోని ఎర్రచెరువు గట్టుపై భారీ వృక్షం కూలిపోవడంతో మృతిచెందిన కొండంపేట గ్రామానికి చెందిన ముద్దాడ శ్రీనివాసరావు కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ మంత్రి, నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ డిమాండ్ చేశారు సోమవారం కొండం పేట గ్రామస్థులు పురపాలక సంఘ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కోండ్రు అక్కడికి చేరుకొని గ్రామస్థులు, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సీఐ దాడి మోహన్‌రావుతో సంఘటనపై చర్చిం చారు. శ్రీనివాసరావు కుటుంబానికి అధికారులు రూ. 25 లక్షలు పరిహారం అందించే వరకు తన పోరాటం ఆగదన్నారు. పార్టీ నాయకులు గురవాన నారాయణరావు, దుప్పల పూడి శ్రీనివాసరావు, వంగ వెంకటరావు, పొన్నాడ భీమేశ్వరరావు, టంకాల నాగరాజు, టంకాల కన్నంనాయుడు పాల్గొన్నారు.



చంద్రశేఖర్ కల్కోరాను సత్కరిస్తున్న దృశ్యం

పుస్తకాలు శక్తివంతమైనవి

విజయనగరం దాసన్నపేట: ఎప్పటికీ వన్నె తరగనివి పుస్తకాలేనని వాజీ ఛానల్ ఎమ్‌డీ గణపతినీడి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సీతం ఇంజనీరింగ్ కళాశాలలో 'విద్యార్థులు- గ్రంథాలయాలు- పుస్తకాల ప్రాముఖ్యత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ మంచి వ్యవస్థలను ప్రతిష్ఠించే శక్తి పుస్తకానికే సొంతమని అన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కోరాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ డీవీ రామమూర్తి, చీఫ్ లైబ్రేరియన్ సత్యవతి, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం అసిస్టెంట్ లైబ్రేరియన్ నారాయణ, సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు: సీఐ

రాజాం: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ దాడి మోహన్ రావు హెచ్చ రించారు. సోమవారం అంబేడ్కర్ కూడలిలో వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుం విధించారు. ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



అంబేడ్కర్ కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ మోహన్‌రావు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పెరుమాళి స్కూల్‌కు బహుమతి

తెర్లాం: ఈ నెల 2న జరిగిన జిల్లా స్థాయి ప్రాజెక్టు ప్రదర్శనలో పెరు మాళి మోడల్ స్కూల్ టాప్ 4లో నిలిచింది. ఈ పాఠ శాల విద్యార్థులు రూపొందించిన 'అగ్రిరోబోట్ ప్రాజెక్టు' 4వ బహుమతికి ఎంపికైంది. గైడ్ టీచర్ టి.లక్ష్మణ్ ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులు జి.దేవి, శ్రీప్రసాద్, వి.కార్తిక్‌లు దీన్ని రూపొందించారు. వీరిని ప్రిన్సిపాల్ పి.జ్యోతిలక్ష్మి అభినందించారు.

టీడీపీలో 100 కుటుంబాల చేరిక

రాజాం/రేగిడి: రేగిడి మండలం అంబాడ వెంకటాపురం గ్రామానికి 50 కుటుంబాలు, రెడ్డిపేటకు చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి సోమవారం టీడీపీలో చేరాయి. వారికి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అంబాడవెంకటాపురం నుంచి చుక్క రామినాయుడు, కొవ్వాడ మహేష్, అంబళ్ల వెంటనాయుడు, గోగల శంకర్రావు, చుక్క తవిటినాయుడు, రెడ్డిపేట నుంచి జమ్ము సత్యం, జమ్ము రామ్, సుంకర గౌరినాయుడు, రెడ్డి తవి టినాయుడు, కొవగాన అప్పలనాయుడు పార్టీలో చేరినట్లు నాయకుడు దూబ ధర్మా రావు తెలిపారు. నాయకులు గోగుల తమ్మినాయుడు, గోగుల అప్పలనా యుడు, వావలిపల్లి వెంకటనాయుడు, వి.ఎరుకనాయుడు, కర్రి శశిభూషణరావు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో కోండ్రు మురళీమోహన్

'జగనన్నకు చెబుదాం'కు 210 వినతులు

● రెవెన్యూ సమస్యలే అధికం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వివిధ సమస్యలపై 210 వినతులు వచ్చాయి. వీటిలో రెవెన్యూ సమస్యలే అధికంగా ఉన్నాయి. కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్, డీఆర్‌వో ఎస్‌డీ అనిత, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సుమబాల, మురళీకృష్ణ, ఆర్‌డీవో సూర్యకళ తదితరులు వినతులు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 150, డీఆర్‌డీఏ 16, గ్రామ వార్డు సచివాలయాల శాఖకు 10, జిల్లా పంచాయితీ శాఖ 10, గృహ నిర్మాణ శాఖ 8, జిల్లా ఆసుపత్రులకు సంబంధించి 8, మున్సిపల్ శాఖకు 5 వినతులు వచ్చాయి.

భూ ఆక్రమణకు ప్రయత్నం..

'భోగాపురం మండలం నందిగాంలోని సర్వే నెంబరు 55-3లో 5.64 సెంట్ల భూమి ఉంది. మా తాతతండ్రుల నుంచి వారసత్వంగా వచ్చింది. ఈ భూముల్లో నీలగిరి తోట వేసుకుని జీవనం సాగిస్తున్నాం. ఇటీవల కొందరు వ్యక్తులు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి... విశాఖపట్టణం పరిధిలో గల ఒక ప్రైవేటు ఆసుపత్రి డాక్టర్ నుంచి రూ.73 లక్షలు తీసుకుని మా భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. గత నెల 24న ఉదయం భూమిలో ఉన్న నీలగిరి మొక్కలను దొంగచాటున నరికి ట్రాక్టరులో తరలిస్తుండగా పోలీసులకు అప్పగించాం. స్థానిక వైసీపీ నాయకుల ఒత్తిడితో నిందితులపై కేసు నమోదు చేయలేదు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాల'ని బంగారి శ్రీనివాసరావు కోరారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలి..

'జనవరి మొదటి వారంలో కొనుగోలు కేంద్రానికి ధాన్యం ఇచ్చాం. సుమారు 20 మంది రైతులకు రూ.23 లక్షలు వరకూ ప్రభుత్వం నుంచి రావలసి ఉంది. ఇప్పటి వరకూ ధాన్యం డబ్బులు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. వెంటనే జిల్లా అధికారులు స్పందించి ధాన్యం డబ్బులు ఇప్పించాల'ని పూసపాటిరేగ మండలం రెల్లివలస గ్రామానికి చెందిన రవికుమార్, శ్రీరాంమూర్తి, రమణమ్మ తదితరులు మొర పెట్టుకున్నారు.

పరీక్షకు అనుమతించలేదు..

'నిర్ణీత సమయం కంటే మూడు నిమిషాలు ఆలస్యంగా పరీక్ష కేంద్రానికి రావడంతో టెట్‌కు అనుమతించలేద'ంటూ పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మికి విన్నవించుకున్నారు. మన్యం జిల్లాకు చెందిన షేక్ ముషఫ్, బాల, సత్యనారాయణ, శివ కుమార్‌లు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లారు. న్యాయం చేయాలని కోరారు.

ఆ భూమిని తీసుకోవద్దు..

'దత్తిరాజేరు మండలం చినచామలాపల్లి గ్రామంలోని గొర్రెలు, మేకల పెంపకంతో జీవనం సాగిస్తున్నాం. గ్రామంలోని సర్వే నెంబరు 100, 101 లోని డీపట్టాలో ఉన్న కొండపోరంబోకు, బంజరును అటవీ శాఖ అధికారులు మా గ్రామానికి అప్పగించారు. సుమారు 50 ఎకరాలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. సుమారు 150 కుటుంబాలు ఈ భూమిపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ భూమిలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం జరుగుతోంది. దీని వల్ల మా గొర్రెలు, మేకలు పెంచుకోవడం కష్టం. అధికారులు స్పందించి న్యాయం చేయాల'ని గొర్రెలు, మేకల పెంపకందారులు కోరారు. తమ పిల్లలకు బెస్ట్ అవలైబుల్ పథకం ద్వారా పాఠశాలలో ఉచితంగా సీటు వచ్చిందని.. కానీ పాఠశాల యాజమాన్యం ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్టీ సూర్యనారాయణ, పి.మహేష్, డెంకాడ వరలక్ష్మి, వి.రాజు తదితరులు కలెక్టర్‌కు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన తాము ఫీజు చెల్లించడానికి చాలా ఇబ్బంది పడుతున్నామని.. తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

చంద్రబాబు సీఎం కావడం అవసరం

- గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ
- సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం


పార్వతీపురం టౌన్: సూపర్ సిక్స్‌పై ప్రచారం చేస్తున్న విజయచంద్ర


సీతంపేట: కరపత్రాలను పంపిణీ చేస్తున్న జయకృష్ణ


గరుగుబిల్లి: పథకాలపై ప్రచారం చేస్తున్న విజయవాంకుశం

పార్వతీపురం రూరల్: రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఎంతో అవసరమని టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. అడ్డాపుసీల పంచాయతీ కోటవాని వలస గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోనుదేవి చంద్రమౌళి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయచంద్ర పాల్గొని, సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జి.వెంకటనాయడుడు, పి.సత్యనారాయణ, బార్నాల సీతారాం పాల్గొన్నారు.
● **పార్వతీపురం టౌన్:** సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర సోమవారం ప్రచారం చేశారు. 11వ వార్డులో గల ముత్తావారవీధి, నెయ్యిల వీధి, మోటుపత్తివారి వీధుల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి మజ్జి వెంకటేష్, సీనియర్ నాయకులు పోలా సత్యనారాయణ, కోలా మధుసూదనరావు, పాలకొండ రాజశేఖర్, టీడీపీ కౌన్సిల్ సభ్యులు టి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమే

సీతంపేట: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం రావడం ఖాయమని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ పేర్కొన్నారు. వెల్లంగూడ, శంబాం పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిమ్మక చిన్నారావు, కుండంగి బుల్లయ్య, నిమ్మక నాగేశ్వరరావు, ఆరిక నాగభూషణ్, నిమ్మక జంగమా, నిమ్మక చంద్రశేఖర్, ఆరిక రాకేష్ తదితరులు పాల్గొన్నారు.
● **గరుగుబిల్లి:** టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడతాయని పార్టీ అరకు పార్లమెంటు కార్యనిర్వాహణాధికారి ముదిలి బాబు విజయవంకుశం అన్నారు. సోమవారం లఖనాపురంలో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరిని గెలిపించాలని కోరారు. పార్టీ ప్రతినిధులు శంకరరావు, గోపి, శ్రీనివాసరావు, ముదిలి సత్యనారాయణ, దాలినాయుడు, శ్రీనివాసరావు, సంతోష్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. ● **కురుపాం రూరల్:** టీడీపీ అమలు చేయబోయే సూపర్ 6 పథకాలపై పార్టీ మండల అధ్యక్షుడు కలిశెట్టి కొండయ్య, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు రంజిత్ కుమార్ నాయికో ఆధ్వర్యంలో కార్యకర్తలు సోమవారం గుజ్జువాయి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టోపై అవగాహన కల్పించారు.


కురుపాం రూరల్: గుజ్జువాయిలో..

సవర భాషా వలంటీర్ల దీక్ష

● సంఘీభావం తెలిపిన టీడీపీ, యూటీఎఫ్ నేతలు


నిరసన తెలుపుతున్న సవర భాషా వలంటీర్లు

బెలగాం: సవర భాషా వలంటీర్లు నిరసన స్వరం పెంచారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఒక రోజు సామూహిక రిలే దీక్ష చేపట్టారు. మార్చి, ఏప్రిల్‌లో తమను విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఆయా నెలల్లో తమను కొనసాగించకపోవడం వల్ల 50 గ్రామాల గిరిజన విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండా చదువుకు దూరమవుతారని తెలిపారు. తమ సమస్యపై ఉన్నతాధికారులు స్పందించాలని లేకుంటే.. ఈనెల11న చలో కలెక్టరేట్ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలో భాషా వాలంటీర్ల సంఘం నాయకులు డుంబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. వారి నిరసనకు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ రావు, పార్వతీపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర, పార్టీ శ్రేణులు సంఘీభావం తెలిపారు. సవర భాషా వాలంటీర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం వచ్చిన తర్వాత సవర భాషా వాలంటీర్ల సమస్యలు పరిష్కరిస్తామని విజయచంద్ర హామీ ఇచ్చారు.

కొట్లాటలో ఇద్దరు వ్యక్తుల అరెస్టు

మక్కువ: బంగారువలస గ్రామంలో ఈనెల 2న ఓ వివాహ వేడుకలో జరిగిన చిన్న తగాదాలో జియ్యమ్మవలస మండలానికి చెందిన తాడేపల్లి శంకర్‌దొరను గాయపరిచిన ఇద్దరు వ్యక్తులపై సోమవారం హత్యాయత్నం కేసు నమోదు చేసి, రిమాండుకు తరలించినట్టు ఎస్ఐ పి.నరసింహమూర్తి తెలిపారు. వివాహ వేడుక ఊరేగింపు సమయంలో బంగారువలస గ్రామానికి చెందిన రెడ్డి శివప్రసాద్, మక్కువకు చెందిన అంబటి గణేష్‌తో పాటు ఒక బాలుడు తన భర్తపై దాడి చేశారని తాడేపల్లి సోమేశ్వరి 3వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఇద్దరు వ్యక్తులను సోమవారం అరెస్టు చేశారు. మూడో వ్యక్తి బాలుడు కావడంతో జువైనల్ జడ్జి ముందు హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

ఖైదీల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


రికార్డులు పరిశీలిస్తున్న జైళ్ల అధికారి కృష్ణారావు

పాలకొండ: సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలకు ఆరోగ్యపరమైన ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సబ్‌జైళ్ల అధికారి బి.కృష్ణారావు అన్నారు. పాలకొండ సబ్‌జైలుకు అర్ధ వార్షిక తనిఖీ సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రిమాండ్ ఖైదీల వివరాలు, రికార్డులు పరిశీలించారు. వారికి బెయిల్‌పై విడుదల చేసేందుకు న్యాయవాదులను ఏర్పాటు చేసుకున్నారా లేదా అని రిమాండ్ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఆహారం, సదుపాయాలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. రానున్న వేసవి కాలం దృష్టిలో ఉంచుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలని జైలు సూపరింటెండెంట్ బి.జోగులుకు సూచించారు. సిబ్బంది జైలు, విధులు నిర్వహణలో యూనిఫాం విధిగా ధరించాలని సిబ్బంది కి సూచించారు. జైలు సిబ్బంది హాజరు పట్టికను, స్టాక్ రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ వార్డర్స్ పి.చంద్రరావు, బి.వి జయ్‌కుమార్, వార్డర్లు నాగరాజు, హేమసుందర్, నరసింహులు పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు చేయాలి

గరుగుబిల్లి: మండలంలోని 13 ఆర్బీకేల పరిధిలో కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు చేయాలని టీడీపీ ప్రతినిధులు అక్కేన మధుసూదనరావు, మర్రాపు పురుషోత్తంనాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి నెలలో విక్రయించిన ధాన్యానికి సంబంధించి నేటికీ జమ కాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వల్లరిగుడబ సర్పంచ్ ఆర్.గోవిందనాయుడు, జనసేన పార్టీ నాయకుడు ఎ.శంకరరావు ఉన్నారు.

సమ్మె కాలపు జీతం ఇవ్వండి

సాలూరు రూరల్: మున్సిపల్ కార్మికుల సమ్మె కాలపు జీతం ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సాలూరు నేత ఎన్‌వై నాయుడు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్మికులతో కలిసి ఆయన సాలూరు మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండగకు ఇవ్వాల్సిన రూ.వేయి, సమ్మె కాలపు జీతం రూ.21వేలు, డ్రైవర్ల వేతనం రూ.24,500 చెల్లింపునకు సంబంధించిన జీవోలు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వాటి ప్రాప్తికి బకాయి జీతాలివ్వాలని డిమాండ్ చేశారు.

'మోసాలు జోగారావుకు అలవాటే'

పార్వతీపురం టౌన్: అబద్ధపు మాటలతో మ్యాజిక్ చేసి.. ప్రజలను మోసగించడం ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు అలవాటుగా మారిందని టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర విమర్శలు గుప్పించారు. ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇప్పటి వరకు స్థలాలను చూపించని లబ్ధిదారులకు మద్దతుగా సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జోగారావు జగనన్న లేఅవుట్లతోపాటు టిడ్కో ఇళ్ల కేటాయింపులో తన మార్కు వేసుకున్నారన్నారు. ఇళ్ల పట్టాలు, స్థలాలు కేటాయించడంలో రెవెన్యూ అధికారులకు అవకాశం ఇవ్వకుండా అన్నీ తానై వ్యవహరించడం సరికాదన్నారు. తన అనుచర వర్గానికి స్థలాలు, పట్టాలు పంపిణీ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యేతో పాటు ఈ ప్రభుత్వానికీ కాలం దగ్గర పడిందన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పాలకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి ఎంఎన్ రాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులు సంబంధిత ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు పొంది, పూర్తి చేసిన దరఖాస్తులను మార్చి 5వ తేదీ నుంచి మార్చి 14వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు అందజేయాలని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై జూలై 1, 2024 తేదీ నాటికి 21-35 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి, స్థానికంగా స్థిర నివాసం ఉన్న వివాహిత మహిళలు మాత్రమే అర్హులన్నారు.

పోలమాంబ వనంగుడి ఆదాయం రూ.6.23లక్షలు


వనంగుడి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

మక్కువ: శంబర శ్రీపోలమాంబ అమ్మవారి వనంగుడి ఆలయ హుండీల లెక్కింపు సోమవారం దేవదాయశాఖ ప్రత్యేక అధికారి డీవీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ లెక్కింపులో రూ.6,23,024 ఆదాయం లభించిందని ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, సత్యసాయి సమితి సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై కోర్ కమిటీ సమావేశం

గుమ్మలక్ష్మీపురం: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక మండల వనరుల శిక్షణ కార్యాలయంలో సోమవారం కోర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈవో చంద్రశేఖర్ దృష్టికి సంఘ నాయకులు వివిధ సమస్యలను తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ చైర్మన్ పాలక దేవానంద్, సభ్యులు పి.ప్రసాద్, ఎన్.గోపాల్, భగవాన్, ఎ.కృష్ణ, బి.సింహాచలం, విశ్వేశ్వరరావు, భాస్కరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను అరికట్టండి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ భూముల ఆక్రమణలను అరికట్టాలని 'జగనన్నకు చెబుదాం'లో పలువురు కలెక్టర్‌కు వినతిపత్రాలను సమర్పించారు. సోమవారం తన కార్యాలయంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, ఆర్డీఓ కె.హేమలతలతో కలిసి కలెక్టర్ నిశాంత్ కుమార్ అర్జీలు స్వీకరించారు. ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 179 అర్జీలు అందించారు. కార్యక్రమం అనంతరం వీరఘట్టం మండలం మాదవలస గ్రామానికి చెందిన దాసరి అలివేలు మంగమ్మకు ఇన్‌చార్జి జేసీ హెల్మెట్ అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీలో వంద కుటుంబాల చేరిక

గుమ్మలక్ష్మీపురం: కుక్కిడి, కొత్తగూడ, నేరేడు, మానుగూడ, గాజులగూడ, నిగరం గ్రామాల నుంచి వంద కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. వీరికి నియోజకవర్గ ఇన్‌చార్జి తోయ జగదీశ్వరి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు కత్రిక మల్లేష్, పాడి సుదర్శనరావు, పోలూరు శ్రీనివాసరావు, వెంకటాపు భారతి, వెంకటరావు, రవి, బిడ్డిక సుదర్శనరావు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.


పార్టీలోకి చేరినవారిని ఆహ్వానిస్తున్న జగదీశ్వరి

ఉపాధి సిబ్బంది నిరసన



భామిని: నిరసన చేస్తున్న ఉపాధి సిబ్బంది, కురుపాం: ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భామిని: జాతీయ ఉపాధి హామీ పథకంలో 2010 పీఆర్సీ ప్రస్తుతానికి చెలామణి అవుతుందని కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంపీడీవో కిషోర్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎంపీడీవో కార్యాలయం ముందు తమకు వేతనాలు పెంచాలని నిరసన తెలిపారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు నిరసన తెలుపుతూ వారి సమాచారం మేరకు ఆందోళన తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు.


గరుగుబిల్లి: ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధి సిబ్బంది

● **కురుపాం:** తమ సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ జాతీయ ఉపాధి హామీ సిబ్బంది సోమవారం కురుపాంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎఫ్‌టీఈలుగా గుర్తించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో వి.అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.
● **గరుగుబిల్లి:** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ సిబ్బంది సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్ల సంఘ అధ్యక్షులు ఎ.శంకరరావు, డి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ నాయకుల పిలుపు మేరకు నిరసన చేపడుతున్నామన్నారు. గత 17 ఏళ్లుగా కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారన్నారు. అనంతరం ఎంపీడీవో పి.సూర్యనారాయణకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు కె.నిర్మల, ఎం.హరికృష్ణ, ఉమ, సోమేశ్వరరావు, భూలక్ష్మి, అజయ్, కంప్యూటర్ ఆపరేటర్లు భద్ర, సునీత, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● టీడీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన సంధ్యారాణి

బెలగాం: తన కుల ధ్రువీకరణ పత్రంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ తన కుల ధ్రువీకరణ పత్రంపై ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో ఐటీడీఏ పరిధిలో ఉపాధ్యాయురాలిగా పని చేశానని, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్‌గా పని చేశానని, తన తండ్రి సాలూరు ఎస్టీ ఎమ్మెల్యేగా చేశారని తెలిపారు. తనను, తన తల్లిని అవమానించే విధంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని ఆగ్రహించారు. తనపై తప్పుడు ఫిర్యాదులు చేసిన వారిపై ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల జేఏసీ నాయకులు కృష్ణబాబు, టీడీపీ నాయకులు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో 8 వినతులు

బెలగాం: స్పందన కార్యక్రమంలో ఎనిమిది ఫిర్యాదులు అందినట్టు ఏఎస్పీ ఓ.దిలీప్‌కిరణ్ తెలిపారు. పార్వతీపురంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏఎస్పీ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో ఏఎస్పీ ఓ.దిలీప్‌కిరణ్ పాల్గొని నేరుగా అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను విని, త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ సీహెచ్.లక్ష్మణరావు, డీసీఆర్బీ సీఐ వాసు నాయుడు, ఎస్‌లు పాల్గొన్నారు.

ఐటీడీఏ స్పందనకు 21 వినతులు

సీతంపేట: ఐటీడీఏ ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్య క్రమానికి 21 వినతులు వచ్చినట్టు పీవో కల్పనా కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలం, డిప్యూటీ డీఈవో లిల్లీరాణి, జీసీసీ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, ప్రాజెక్టు ఉద్యానవనాల అధికారి గణేష్, వ్యవసాయాధికారి హరికృష్ణ, సీడీపీఓ రంగలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

వీరఘట్టం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా, రసాయన ఎరువుల వాడకం వల్ల భూమి సారవంతం కోల్పోతుందని ఏపీఎం బి.శివున్నాయుడు తెలిపారు. మండల మహిళా సమాఖ్య ప్రాంగణంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య, రైతుసాధికార సంస్థ ఒప్పందం ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో సింహాచలం, వివిధ గ్రామాల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై నిర్లక్ష్యం వద్దు

గరుగుబిల్లి: చిన్నారులకు పోలియో చుక్కలు వేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని జిల్లా డీఐవో నారాయణ హెచ్చరించారు. ఉల్లిభద్రలో ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పీహెచ్‌సీల పరిధిలో సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి సమాచారం సేకరించి ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కలు వేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో గరుగుబిల్లి వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్, సూపర్‌వైజర్లు జయగౌడ్, ఉదయకుమారి, సిబ్బంది కె.అనిత, మాలతి, అంగన్‌వాడీలు లావణ్య, కల్పనతో పాటు ఆశా కార్యకర్తలు ఉన్నారు.

'ఎమ్మెల్యే మాట తప్పారు'

గరుగుబిల్లి: మండలంలో చిలకాం రహదారి మార్గానికి నిధులు మంజూరు చేసి, ప్రజలకు సౌకర్యంగా ఉండేలా తీర్చిదిద్దుతామని చెప్పిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి మాట తప్పారని టీడీపీ అరకు బీసీ సెల్ అధికార ప్రతినిధి డి.సత్యనారాయణ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న గతుకుల రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ రహదారిని బాగు చేస్తాని చాలెంజ్ చేసిన పుష్పశ్రీవాణి నేడు ముఖం చాటేశారన్నారు. ఎవరు ముందు ప్యాకేజీలు అందిస్తే ఆ ప్రాంతానికే పనులు నిర్వహించడం అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జుంబిరి గెడ్డపై వంతెన నిర్మించాలి

కురుపాం రూరల్: సుమారు 12 గిరిజన గ్రామాలకు లబ్ధి చేకూరే విధంగా జుంబిరి గెడ్డపై వంతెన నిర్మించాలని సీపీఎం నాయకుడు కోరాడు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జుంబిరి గెడ్డను సందర్శించారు. వర్షాకాలంలో గెడ్డ పొంగి ప్రజలు, మూగ జీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయని, తక్షణం ప్రభుత్వం వంతెన నిర్మించాలని కోరారు.

పీహెచ్‌సీ తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న జనార్దన్

జియ్యమ్మవలస: జియ్యమ్మవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కుటుంబ నియంత్రణ విభాగ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జనార్దన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు ఎలా జరుగుతున్నాయి? ప్రసవాలు ఎన్ని జరిగాయి? తదితర అంశాలపై రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీష్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఫార్మాసిస్ట్ దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో సబ్‌స్టేషన్ ప్రారంభం

సాలూరు రూరల్: చంద్రంపేట వద్ద గుమడాం రెవెన్యూలో ఉన్న సాలూరు టిడ్కో కాలనీకి విద్యుత్ సౌకర్యం కోసం రూ.3.85కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను డిప్యూటీ సీఎం రాజన్నదొర సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ దీప్తి, ఏఎంసీ చైర్‌పర్సన్ అనంతకుమారి శ్రీనివాస్, పాచిపెంట ఎంపీపీ ప్రతినిధి చినబాబు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 67 వినతులు

ఒడిశా

రాయగడ: స్థానిక జడ్పీ సమావేశ హాలులో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 67 మంది అర్జీదారులు తమ ఫిర్యాదులను అందజే శారు. వాటిలో 44 వ్యక్తిగత ఫిర్యాదులు, 19 సామాజిక ఫిర్యాదులు ఉన్నాయి. వాటిని పరిశీలించిన కలెక్టర్ ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.15వేలు చొప్పున అందజేశారు. మరో ఇద్దరికి రెడ్‌క్రాస్ ఫండ్ నుంచి రూ.15వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ హరీష్ బీసీ, సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి, జిల్లా కేంద్ర ఆసుపత్రి ముఖ్య వైద్యాధికారి లాల్ మోహన్‌రౌత్రాయ్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నీటి ప్రాజెక్టులకు శంకుస్థాపన

రాయగడ: రాయగడ జిల్లా కళ్యాణ సింగుపూర్ సమితిలోని దంగమటి గ్రామం వద్ద చిన్న నీటిపారుదల ప్రాజక్టు, బూదాన్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ సోమవారం వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి జగన్నాథ మాట్లాడుతూ సరక ప్రాజెక్టు ద్వారా గ్రామాల్లోని 572 హెక్టార్లకు నీరు అందుతుందని తెలిపారు. దంగమటి వద్ద జలవనరుల శాఖ చేపట్టిన కళ్యాణి మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు కొత్త విరల్ కెనాల్ ద్వారా సాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగ పడుతుందని చెప్పారు. కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ అధ్యక్షురాలు అనసూయామాఝి, జడ్పీ అధ్యక్షురాలు సర్వస్వతి మాఝి, నిహార్‌రంజన్ కోహర్ బిజూ స్వస్థ్య కళ్యాణ యోజన సలహాదారు సుధీర్‌దాస్, అమో ఒడిశా-నవీన్ ఒడిశా జిల్లా సమన్వయకర్త పి.గౌరిశంకరరావు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్

క్లుప్తంగా..

ధర్నా జయప్రదం చేయాలి

పాలకొండ: పది ఎకరాల వరకు పోడు పట్టాలు ఇవ్వాలని, గిరిజన భూ సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 5న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు దూసి దుర్గారావు కోరారు. ఈసందర్భంగా సంఘం ఆధ్వర్యంలో సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్.నాగరాజు, సింహాచలం, ఎస్.పాపారావు, ఎస్.విశ్వనాథం, ఎస్.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో ఆదర్శ విద్యార్థుల ప్రతిభ

భామిని: బాక్సింగ్ పోటీల్లో భామిని ఆదర్శ పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ తెలిపారు. విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో కె.శాంతికుమారి, కె.దివ్యశ్రీ రజిత పతకాలు సాధించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

భామిని: స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం 305 మందికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చేతుల మీదుగా ఇళ్ల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పంపిణీ చేశారు. రెండేళ్ల కిందట జగనన్న కాలనీ కింద 480 ఇళ్ల పట్టాలు ఇవ్వగా, మళ్లీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌గా నమోదు చేసి అందించారు. భామిని, లివిరి తదితర గ్రామాల్లో జగనన్న కాలనీల్లో లేఅవుట్లు తప్ప నిర్మాణాలకు నోచుకోలేదు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావుతో పాటు ఎంపీడీవో కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రాష్ కార్యక్రమం

గరుగుబిల్లి: మండలంలోని 25 పంచాయతీల్లో ఈనెల 6వ తేదీ నుంచి క్రాష్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌరీశంకర్ తెలిపారు. సోమవారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఈనెల 6 నుంచి ఏప్రిల్ 18వ తేదీ వరకు క్రాష్ ప్రోగ్రాం నిర్వహిస్తామని చెప్పారు. ఆయా పంచాయతీల కార్యదర్శులు తగు సమాచారం అందించాలన్నారు.

మెనూ సక్రమంగా పాటించాలి

వీరఘట్టం: మధ్యాహ్న భోజన పథకం మెనూ పక్కాగా అమలు చేయాలని ఎంఈవో ఆనందరావు తెలిపారు. నడుకూరు ఎంపీయూపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని సోమవారం పరిశీలించారు. అనంతరం పాఠశాల రికార్డులు పరిశీలించారు.

విశ్వేశ్వరస్వామికి నాగాభరణం

పాలకొండ: కోటిపల్లి గ్రామంలోని విశ్వేశ్వరస్వామికి సుమారు రూ.రెండు లక్షల విలువైన వెండి నాగాభరణం కానుకగా సోమవారం అందించారు. న్యాయవాది లక్ష్ముంనాయుడు, ఉపాధ్యాయులు కృష్ణవేణి దంపతులు స్వామివారికి కానుక అందించారు.

మద్యం స్వాధీనం

భోగాపురం: మండలంలోని పోలిపల్లి జంక్షన్‌లో అదే గ్రామానికి చెందిన నిమ్మల రమణ అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకుని, 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ ఎ.రవికుమార్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.